

అతివలే నిర్ణేతలు!


తూర్పు నియోజకవర్గంలో ఓ భాగం



- తూర్పులో మహిళా ఓటర్లదే పైచేయి
- మొత్తం ఓటర్లు 2,76,523 మంది
- పురుషులు 1,35,516.. మహిళలు 1,40990

ఆరిలోవ: మహిళా లోకం తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో అభ్యర్థుల భవిత్యాన్ని నిర్ణయించే స్థాయిలో నిలిచారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో 2024 సంవత్సరంలో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఓటర్ల జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. రానున్న సార్వత్రిక ఎన్నికలకు కూడా ఈ నియోజకవర్గంలో పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా నమోదైంది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,76,523 మంది ఓటర్లు నమోదయ్యారు. వారిలో పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లు 5,474 మంది ఎక్కువగా ఉన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో మొత్తం 2,72,463 మంది ఓటర్లలో పురుష ఓటర్లు కంటే 4,900 మంది మహిళా ఓటర్లే ఎక్కువగా నమోదయ్యారు. వీరిలో 18 సంవత్సరాలు నిండినవారి నుంచి 100 సంవత్సరాలు పైబడిన వారు ఉన్నారు. ఎన్నికల అధికారులు యువ ఓటర్లను ఎక్కువ మందిని ఓటర్ల జాబితాలో చేర్చాలని ప్రయత్నించారు. అయినప్పటికీ నియోజకవర్గంలో నివసిస్తున్న జనాభాకు తగిన విధంగా యువ ఓటర్లు తమ ఓటు నమోదుకు ముందుకు రాకపోవడం విశేషం.

మొత్తం ఓటర్లు 2,76,523 మంది..

ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం తూర్పు నియోజకవర్గంలో 2024లో జరగనున్న సాధారణ ఎన్నికలకు 2,76,523 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వారిలో 1,35,516 మంది పురుషులు కాగా, 1,40,990 మంది మహిళా ఓటర్లు నయోదయ్యారు. మరో 17 మంది ఇతరులు(ట్రాన్స్‌జెండర్) ఓటర్లు నమోదయ్యారు. వారిలో 5,377 మంది 18-19 సంవత్సరాల వయసు గల వారితో పాటు 120 సంవత్సరాలు దాటిన నలుగురు వృద్ధుల వరకు నమోదయ్యారు. మొత్తం ఓటర్ల జాబితాలో అత్యధికంగా 30 నుంచి 39 సంవత్సరాలు మధ్య వయసు గలవారు 70,324 మంది ఉండగా.. అత్యల్పంగా 120 సంవత్సరాలు దాటిన వారు నలుగురు(ఒకరు పురుషుడు, ముగ్గురు మహిళలు) ఉన్నారు. వీరిలో కొత్తగా చేరిన యువ ఓటర్లు సుమారు 5400 వరకు ఉన్నారు. ఇదిలా ఉండగా 110 నుంచి 119 సంవత్సరాల మధ్య వయసు గలవారు ఒక్కరూ లేకపోవడం విశేషం.

వయసుల వారీగా ఓటర్ల వివరాలు

వయసు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
18-19	2854	2523	0	5377
20-29	21,079	21,092	6	42,574
30-39	33,096	37,222	6	70,324
40-49	30,691	33,281	2	63,974
50-59	23,645	23,412	2	47,059
60-69	14,193	13920	1	28,114
70-79	7476	6874	0	14,341
80-89	2223	2022	0	4,245
90-99	267	235	0	502
100-109	0	0	0	6
110-119	0	0	0	0
120 పైగా	1	3	0	4
మొత్తం	1,35,516	1,40990	17	2,76,523

క్లుప్తంగా

రేపటి నుంచి యోగా శిబిరాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నుంచి సాధారణ యోగా, స్థూలకాయ నివారణ యోగా శిబిరాలను నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8, ఉదయం 8 నుంచి 9 జనరల్ యోగా తరగతులు, సాయంత్రం 4 నుంచి 5, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్థూలకాయ నివారణ యోగా శిబిరాలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రూ.38.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో రూ.38.40 లక్షలతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో ఇసుకతోట రామాలయం వీధిలో సీసీరోడ్లు, కాలువల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఆధునిక బస్‌బేల నిర్మాణం, పార్కుల ఆధునికీకరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, దాసరి రమేష్, వెంకట సురేష్‌రెడ్డి, ఇప్పిలి పార్వతి, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో చోరీ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆరిలోవ క్రైం ఎస్.మురళీకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి పక్కన వెటర్నరీ వైద్యుల లేఅవుట్‌లోని ఓ ఇంట్లో బ్యాంక్ ఉద్యోగి మూర్తి అద్దెకు ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు సంక్రాంతికి ఊరెళ్లారు. మూర్తి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగలుగొట్టి తెలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపల పరిశీలించారు. బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు వస్తువులు, రూ.5 వేలు నగదు కనిపించ లేదు. దీంతో అదేరోజు రాత్రి బాధితుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో క్రైం పోలీసులు క్లూస్ టీంను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆ ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను కూడా పోలీసులు పరిశీలించారు. ఆ పుటేజీలలో ఆరుగురు వ్యక్తులు రక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. మొదటి ఒక వ్యక్తి స్కూటీపైన వెళ్లిన కొంత సేపటికి మరో ఇద్దరు బెల్లెట్‌పై వెళ్లి ఆ ఇంటిని కొంత సేపు బయట నుంచి పరిశీలించారు. అనంతరం వాళ్లు వెళ్లిన కొద్ది సేపటికి మరో ముగ్గురు నడుచుకుంటూ వెళ్లి ఆ ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల కాలంలో ఇక్కడి వెటర్నరీ కాలనీలో దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం విశేషం.

5 కిలోల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐదో పట్టణ పోలీసుల వివరాలిలా..విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఊర్వశి వద్ద తమిళనాడులోని కాంచీపురానికి చెందిన పెరుమాళ్ తియాగు, వి.కార్తీక్, చెంగల్‌పట్‌కు చెందిన గోపాల్ కన్నన్ రఘు అనే ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పాడేరులో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది.

ప్రజాకర్షక పాలనకు మద్దతుగా నిలవండి

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 17వ వార్డులో కొనసాగిన పాదయాత్ర


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర గురువారం 17వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 27వ రోజు 17వ వార్డులోని ఇందిరానగర్, వెంకోజీపాలెం ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు హారతలు ఇచ్చి ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనకు రాష్ట్ర ప్రజలు అండగా నిలవాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆయన నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఏయూ అభివృద్ధికి మరింత కృషి అవసరం


వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న సురేష్‌బాబు


వీసీ ప్రసాదరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు


బీచ్ రోడ్డు: ఏయూ వీసీగా రెండో సారి నియమితులైన ఆచార్య ప్రసాదరెడ్డికి అభినందనలు వెల్లువెత్తున్నాయి. గురువారం వీసీని తన కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు కలిసి సత్కరించారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో యూనివర్సిటీ మరింత అభివృద్ధికి కృషి చేయాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ స్టీఫెన్, ట్రస్ట్ సభ్యులు మౌనిక, బాషా, ఉమా మహేశ్వర్ పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల అభినందనలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డిని గురువారం ఉదయం పలువురు విదేశీ విద్యార్థులు అభినందించారు. తన కార్యాలయంలో వీసీని ఇథియోపియా, కాంబోడియా, వియత్నాం తదితర దేశాలకు చెందిన విద్యార్థులు మర్యాద పూర్వకంగా కలిశారు. రెండో సారి బాధ్యతలు చేపట్టిన ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజనీతి, ప్రభుత్వ పాలనశాస్త్రం విభాగ విద్యార్థులు కేక్ కట్ చేశారు.

మద్దిలపాలెం : ఏయూ వీసీగా నియామకమైన ప్రసాదరెడ్డికి 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిబాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గర్వించే స్థాయికి ఏయూ విద్యార్థులు ఎదగాలి


విద్యార్థులకు బహుమతి అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి


విద్యార్థిని నృత్య ప్రదర్శన

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గర్వించే స్థాయికి వర్సిటీ విద్యార్థులు ఎదగాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వర్సిటీలో ఉండే రెండేళ్ల కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పొందే జ్ఞానం వారి ఉన్నతిని నిర్ణయిస్తుందన్నారు. మన లక్ష్యం ఎంత ప్రధానమో.. ప్రయాణించే మార్గం కూడా అంతే ప్రధానమన్నారు. కళాశాలలో ఉండే ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని చెప్పారు. ఏయూ జ్ఞానానికి కేంద్రంగా, ప్రగతికి నిలయంగా ఉందన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ప్రస్తుతం బ్యాచ్ భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి విద్యార్థి జాబ్ లెటర్‌తో బయటకు వెళ్లాలని, ఆసక్తి ఉంటే ఎంటర్‌ప్రెన్యూనర్‌గా ఎదగాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాలను, సోషల్ మీడియాను సమర్థవంతంగా, తమ అభ్యున్నతికి ఉపయోగించుకోవాలన్నారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ గతేడాది విభాగంలో 23 కార్యక్రమాలను నిర్వహించామని, 78 సంస్థలు ప్రాంగణ నియామకాలు జరిపి 171 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందించాయన్నారు. అత్యధికంగా తమ విభాగ విద్యార్థి రూ.24 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు వీసీ ప్రసాదరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ ఆచార్య ఎం.ఉమాదేవి, ఆచార్య సి.సూర్యనారాయణ, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య రమణమూర్తి పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

టీచర్ ఎడ్యుకేషన్‌పై పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన సోషియాలజికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. వర్తమాన సమాజానికి ఉపయుక్తంగా టీచర్ ఎడ్యుకేషన్‌లో విభిన్న కోణాలను స్పృశిస్తూ పుస్తక రచన చేసిన షారోన్‌రాజుని వీసీ అభినందించారు. అనంతరం రచయిత మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పూర్వ పాలక మండలి సభ్యులు గిరిజా అగస్టీన్, సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి. సత్యనారాయణరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

లెక్చర్ సిరీస్ పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే లెక్చర్ సిరీస్ పోస్టర్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్తమాన సమాజంలో గాంధీజీ ఆలోచనల ఆవశ్యకత అనే అంశంపై గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో లెక్చర్ సిరీస్‌ని నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా గాంధేయవాదులు, గాంధీ సిద్ధాంతాలను అనుసరించే వ్యక్తులతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకార సంఘం క్యాలెండర్ విడుదల

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం నూతన సంవత్సర క్యాలెండను గురువారం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సహకార సంఘం అధ్యక్షుడు ఆచార్య వి.సిద్ధయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మణబాబు, కార్యదర్శి ఖాదర్‌బాబా, డైరెక్టర్లు డొక్కర శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, డాక్టర్ యుగంధర్, డి.గోవింద్, కె.కిరణ్, మేనేజర్ ఆర్.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ ప్రి టాక్ నిర్వహణ


ధ్రువపత్రం బహూకరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ ప్రీ టాక్‌ని రెండు రోజుల పాటు నిర్వహించారు. గురువారం వీరికి సర్టిఫికెట్లు జారీ చేశారు. గత రెండు రోజులుగా ఏయూ ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కోర్సుల్లో 9 విభాగాలకు చెందిన 20 మందికి ప్రీ టాక్ నిర్వహించారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ సమక్షంలో విభాగాధిపతి, బీవోఎస్ చైర్మన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్, రీసెర్చ్ గైడ్‌లతో కూడిన ప్యానల్ ఎంతో పటిష్టంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. మంగళ, బుధవారాల్లో ఏయూ టీడీఆర్ హబ్‌లో నిర్వహించిన ప్రీటాక్‌లో పరిశోధకులు గత మూడున్నర సంవత్సరాలుగా తాము ఎంపిక చేసుకున్న అంశంలో జరిపిన పరిశోధన, ఫలితాలు, విశ్లేషణలు నిపుణులకు వివరించారు. పరిశోధకులు తమ పరిశోధనలో అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత శాస్త్ర నిపుణులు అడిగిన ప్రశ్నలకు పరిశోధకులు సమాధానమిచ్చారు. వీటిని పరిగణనలోనికి తీసుకుని ప్రీ టాక్‌లో అర్హత సాధించినట్లు అధికారులు ప్రకటించారు. వారికి గురువారం సర్టిఫికెట్లను అందించి, అధికారులు అభినందించారు. వరంగల్, టెక్కలి, శ్రీకాకుళం, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి పరిశోధకులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య కె.శ్రీనివాసరావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం


ఎఫ్‌సీఐలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ఇగ్నోలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ధర్మారావు

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవంతో పాటు జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కలసి ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటర్ల ప్రభావం గురించి విద్యార్థులకు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటుకు ఉండే ప్రాధాన్యతను తెలియజేశారు. యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.రవి, ఎన్.పార్థసారథి, బి.కుముధిని, జాషువా, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో గురువారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు కావాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ జె.వి.ఎస్.రామ్మోహనరావు మాట్లాడుతూ యువతీ, యువకులు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇగ్నోలో..

ఎంవీపీ కాలనీ: ఉషోదయ కూడలిలోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంత కీలమైనదో గుర్తించాలన్నారు. దేశాభివృద్ధి, సమాజాభివృద్ధిని కాంక్షించే విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.


ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

'ఆడుదాం ఆంధ్రా' తూర్పు విజేత పీతలవానిపాలెం జట్టు


పీతలవానిపాలెం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఎస్‌డీవో జూన్ గాలియేట్

ఎంవీపీ కాలనీ: ఆడుదాం.. ఆంధ్రా క్రీడల్లో షటిల్ పోటీలకు సంబంధించి తూర్పు నియోజకవర్గం విజేతగా పీతలవానిపాలెం సచివాలయం జట్టు నిలిచింది. ఏయూ ఇండోర్ జిమ్నాజియం వేదికగా కొద్ది రోజులుగా ఈ పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. తొలుత ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ గురువారం ఉదయం ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం కొద్ది సేపు ఆటను తిలకించిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలికితీయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. నియోజకవర్గం స్థాయిలో పీతలవానిపాలెం సచివాలయం, సిరిపురం సచివాలయం జట్ల మధ్య తుది పోటీ హోరాహోరీగా జరిగింది. అయితే చివరికి పీతలవానిపాలెం జట్టు గెలుపొంది తూర్పుజోన్ విజేతగా నిలిచింది. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గాలియేట్ వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచి జట్లు క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వీర్రాజు, పలువురు జిల్లా క్రీడా విభాగం ఉన్నతాధికారులు, సచివాలయం ఎడ్యుకేషన్ కార్యదర్శి యూన్సీ, పలువురు జీవీఎంసీ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.